క్లుప్తంగా

నేటి నుంచి ముత్యాలమ్మ తిరునాల

ములకలచెరువు : మండలంలోని బురకాయల కోటలో వెలసిన ముత్యాలమ్మ తిరునాల శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఆలయ శుద్ధి, గోపూజ, గణపతి పూజ, ఆదివారం మహా అభిషేకం, అమ్మవారికి జ్యోతులు, మొక్కులు తీర్చుకొనుట, సోమవారం పారాయణము, కుంకుమార్చన, మహామంగళ హారతితో తిరునాల ముగుస్తుంది. కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

మదనపల్లె సిటీ : స్థానిక కదిరిరోడ్డులోని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, స్వామికి పంచామృతాభిషేకం, ఆరాధన మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం దీపారాధన, షోడశోపచార పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లక్ష్మీనారాయణచారి, భాస్కరాచారి, అర్చకులు వీరబ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె సిటీ : వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతం, అభిషేకాలు, నిత్యకైంకర్యం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో ప్రాకారోత్సవం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు గిరిధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కలికిరి సర్పంచ్ మృతి



ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

కలికిరి : మండలంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి(62) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ నెల 5 తేదీన తన స్వగృహంలో అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సర్పంచ్ శక్రవారం చివరి శ్వాసవిడిచారు. 2021 ఫిబ్రవరిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కలికిరి గ్రామ పంచాయతీకి వైఎస్సార్‌సీపీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన జిల్లా స్థాయిలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం కలికిరి రెడ్డివారిపల్లిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ బట్రెడ్డిగారిపల్లికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు రాజారెడ్డి(82) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం ఉదయం కలికిరి బట్రెడ్డిగారిపల్లికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం



సూర్యప్రభ వాహనంపై స్వామి



రెడ్డప్పనాయుడులో కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు

సూర్య, చంద్రప్రభ వాహనాలపై వెంకన్న

మదనపల్లె సిటీ : శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఆగమోక్తంగా ఆరంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. అనంతరం శ్రీవారి ఆస్థానాన్ని ఘనంగా చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ స్వామి వారి సమక్షంలో మిధున లగ్నమందు ధ్వజారోహణం నిర్వహించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం ధ్వజారోహణం ఉద్దేశం. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవర్లకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

సూర్య,చంద్ర వాహనాలపై వెంకన్న: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం రెడ్డప్పనాయుడు కాలనీ, బ్యాంకు కాలనీ,గొల్లపల్లి భక్తాదులు ఉభయదారులుగా వ్యవహరించారు.ప్రత్యేక వాహనంలో స్వామి సూర్యప్రభవాహనంపై రెడ్డప్పనాయుడు కాలనీలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు ద్వారకనాథ రెడ్డి, కంభం నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఈశ్వరమ్మకాలనీ ఉభయదారులుగా స్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఈటీ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు తదితరులు పాల్గొన్నారు.

నడకతో గుండె పదిలం



ఉదయం నడక ప్రయోజనాలపై స్వాస్థ ఆస్పత్రి వాకథాన్ ర్యాలీ

మదనపల్లె : ఉదయం పూట నడకతో అనేక శారీరక, మానసిక ప్రయోజనాలతో పాటు ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ది సత్సంగ్ ఫౌండేషన్ సభ్యులు వెంకీ నటరాజ్, స్వాస్థ్య హాస్పిటల్ వైద్యులు డాక్టర్. ప్రియం, సతీష్‌రెడ్డి, కృష్ణతేజ అన్నారు. గుండె పదిలంగా ఉండేందుకు నడక సాగిద్దామంటూ శుక్రవారం ఉదయం స్వాస్థ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది మార్నింగ్‌వాక్‌తో కలిగే ప్రయోజనాలను నినదిస్తూ...ప్లకార్డులు ధరించి బెంగళూరు బస్టాండ్ నుంచి అనిబిసెంట్ సర్కిల్, యన్‌టీఆర్ సర్కిల్ మీదుగా స్వాస్థ్య హాస్పిటల్స్ వరకు నడక సాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి రోజు 30 నిమిషాలు నడవడం వలన రక్తపోటు అదుపులో ఉంటుందన్నారు. కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గి గుండెసమస్యలు 30శాతం తగ్గుతాయన్నారు. శరీరంలో ఎండార్ఫిన్ అనే యాసిడ్ విడుదలై మానసిక స్థితిని మెరుగుపరుస్తుందన్నారు. ఉదయపు నడక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ లక్షణాలను తగ్గించి, సంతోషంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పవన్, స్వాస్థ్య హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

షేక్స్‌పియర్ రచనలు స్ఫూర్తిదాయకం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

కురబలకోట : ప్రపం వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గడించిన ప్రముఖ నాటక కర్త షేక్స్‌పియర్ రచనలు ఎప్పటికీ వన్నెతగ్గనివని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్ అన్నారు. ఆంగ్ల భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఆంగ్ల, ఫారిన్ లాంగ్వేజెస్ విభాగంచే శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్లం తప్పనిసరిగా మారిందన్నారు. షేక్స్‌పియర్, ఇంగ్లీషుకు ఎనలేని వన్నె తెచ్చారన్నారు. ఆయన రచనలు నిత్య నూతనమే కాకుండా సజీవమన్నారు. భావ సౌందర్యం, పదాల పొందిక, రచనా శైలి, పద్య ప్రక్రియ, మనిషి మనో భావాల ఆవిష్కరణ, అర్థవంతమైన భావనలు నేటి తరం వారికే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శనీయమన్నారు. కత్తి కంటే కలం గొప్పదన్న నానుడి రావడం వెనుక షేక్స్‌పియర్ స్ఫూర్తి, ప్రేరణ దాగి ఉందన్నారు. స్టాన్లీ హౌటన్ రచించిన ది డియర్ పార్టెడ్, ఎకామెడి ఇన్ వన్ యాక్ట్ నవల నాటకాన్ని విద్యార్థులు ఈ సందర్భంగా ప్రదర్శించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత



మురుగునీటి కాలువలో పూడిక తీపిస్తున్న గ్రామ పంచాయతీ, ఆర్టీసీ అధికారులు

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు సర్పంచ్ జీనత్ షఫీ అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణం ఆర్టీసీ బస్టాడ్ సమీపంలో మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టారు. గురువారం కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా జలమయం కావడంతో ప్రయాణికులు, ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకుని స్థానిక ఆర్టీసీ నల్లగుట్ట నుంచి మురుగునీటి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టినట్లు తెలిపారు. మురుగునీరు బస్టాండ్‌లోకి రాకుండా తగు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈవో గఫూర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, డీఎం కుమార్, ఆర్టీసీ ఏఈ సిద్ధనాగులు తదితరులు పాల్గొన్నారు.

అధిక రక్త పోటుపై అవగాహన కలిగి ఉండాలి



బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పీలేరు : అధిక రక్త పోటుపై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య అన్నారు. శుక్రవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని బండ్లవంకలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీపీ చేసుకోవడం ద్వారా ఎక్కువ కాలం జీవించవచ్చునని తెలిపారు. తీవ్ర తలనొప్పి, అలసట, మసకబారిన దృష్టి, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, తదితర ప్రాథమిక సంకేతాలు బీపీ కావచ్చునని చెప్పారు. వ్యాధి నిర్ధారణతో దీర్ఘకాలిక చికిత్సలు అవసరముంటాయని తెలిపారు. ధూమపానం, అధిక బరువు, శారీరక శ్రమ లోపించడం, ఆహారపు అలవాట్లు, మద్యం సేవించడం, ఒత్తిడికి గురికావడం లాంటివి అధిక రక్తపోటుకు కారణాలని తెలిపారు. రోజుకు 30 నిమిషాల నడక, మంచి ఆహారపు అలవాట్లతో బీపీని నియంత్రించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శ్రీనివాసులు, వెంకటరత్నం, ఏఎన్ఎం భార్గవి, సీహెచ్‌వో చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

బీపీ చెక్ చేసుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం



వాల్మీకిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

వాల్మీకిపురం : మన బిపి చెక్ చేసుకొని నియంత్రిద్దాం.. ఎక్కువ కాలం జీవిద్దాం అని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మనకి రాకుండా కొన్ని జాగ్రత్తలు మనం తీసుకోవాలన్నారు. తల తిరగడం, కళ్లు మసకబారడం, నీరసం వంటివి లోబిపి లక్షణాలని, విపరీతమైన తలనొప్పి, జ్వరం, అలసట వంటివి హై బీపీ లక్షణాలన్నారు. అలాగే మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, బీపీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు శివాని, శ్రీలక్ష్మి, హిమబిందు, కిషోర్, శ్రీవిద్య, వైద్య సిబ్బంది గోవిందమ్మ, నాగిరెడ్డి, మురళి, గంగాధర, నూరని, సరస్వతి, నాగమణి, సునీత, బాబాఫకృద్దీన్, జావీద్, విజ్ఞాన్, సుధాకర్, ఇందిరా, మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రావమ్మా.. మా తల్లీ గంగమ్మా



నిమజ్జనానికి వెళుతున్న గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోడూరు గంగమ్మ జాతర శుక్రవారం నిర్వహించిన నిమర్జనంతో ముగిసింది. పట్టణంలోని పాత బజారువీధిలో గంగమ్మ మిట్టలో వెలసివున్న గంగమ్మను గత రెండురోజులుగా వేలాది మంది ప్రజలు, భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి గంగమ్మ మిట్ట నుండి కొనసాగిన అమ్మవారి శోభాయాత్ర వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా సాగింది. మహిళలు గంగమ్మకు హారతులు ఇచ్చారు. భక్తులు దారి వెంబడి మొక్కుబడులు తీర్చుకొన్నారు. ఈ ఏడాది మమ్మల్ని సుభిక్షంగా చూడాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. యువకులు పెద్ద ఎత్తున వసంతాలు చల్లుకొంటూ, భారీఎత్తున బాణసంచా కాలుస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేక డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి మట్టి, పూల కోసం ప్రజలు ఎగబడ్డారు. జాతరలో సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి



రక్తదానం చేస్తున్న దాతలు

రాయచోటి టౌన్ : ఆరోగ్యవంతులుగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం రాయచోటికి చెందిన డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ వినయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే డాక్టర్ బయారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇతరుల ప్రాణాలను కాపాడటంతోపాటు మన రక్తం ఎప్పటికప్పుడు శుభ్రమవుతుందని తెలిపారు. ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి మాట్లాడుతూ యువత సమాజ సేవపై ఆసక్తి కలిగిండాలని, విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మహేశ్వర రాజు, బ్యాంక్ బరోడా బ్యాంక్ మేనేజర్ మహేష్, డాన్స్ మాస్టర్ రేష్మా,కిరణ్, రామాంజులు, నాగరాజు, శివ, సునీల్, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శిలాఫలకం ధ్వంసం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లులో ఏర్పాటు చేసిన వైస్సార్‌సీపీ శిలాఫలకాన్ని శుక్రవారం గుడ్డంపల్లికి చెందిన ఎస్‌వీఆర్ అలియాస్ రమణ అనే టీడీపీ కార్యకర్త ధ్వంసం చేశాడు. అయితే సదరు వ్యక్తి సైకోలా వ్యవహరించి శిలా ఫలకాన్ని ధ్వంసం చేశాడని పలువురు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు తెర వెనుక కీలక పాత్ర పోషిస్తూ రమణను రెచ్చగొట్టి ఇలా చేయించారని మరి కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలను అదుపు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసామని ఎస్‌ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు.

22న డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ : ఆర్టీసీ బస్సుల వల్ల కలిగే ఇబ్బందులు, సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 22న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ-1 డిఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటలలోపు 9959225676కు ఫోన్ చేయాలని కోరారు. వన్, టు డిపో పరిధిలోని ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు తెలియజేయవచ్చునన్నారు.

30 లక్కీడిప్ డ్రా :
మదనపల్లె-బి.కొత్తకోట రూట్‌లో ప్రయాణించిన ప్రయాణికులకు కోసం లక్కీడిప్ డ్రా ఈనెల 30 న తీయనున్నట్లు డీఎం తెలిపారు. ప్రయాణికులు తమ టిక్కెట్టు వెనుకవైపున పేరు, మొబైల్ నంబర్, ఊరు పేరు రాసి గిఫ్ట్ బాక్సులో వేయాలని కోరారు.

రక్తపోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ఉమర్‌ఫారూక్

తంబళ్లపల్లె : రక్తపోటు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జేసీజే కోర్టు జడ్జి ఉమర్ ఫారూక్ అన్నారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు తరచూ పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎన్‌సీడీ విభాగం ఉందని దీని కోసం ప్రత్యేకంగా వైద్యులు, సిబ్బంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు రిచర్ట్స్, విక్రాంత్‌రెడ్డి, తేజస్విని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యమ్మకు ప్రత్యేక పూజలు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి జాతీయ రహదారి పక్కన వెలసివున్న శ్రీ సత్యమ్మ అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా వేకువజాము నుంచే అమ్మవారిని మహిళలు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు నిర్వహించి కాయాకర్పూరం సమర్పించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

నేడు కన్యకా పరమేశ్వరి జయంతి

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం విందు భోజనం, సాయంత్రం కోలాటాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం జయంతి సందర్భంగా భారీ ఎత్తున కేక్‌ను ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

మదనపల్లె : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, టాలీ కోర్సుల్లో ఉచిత నైపుణ్యశిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. ఉచిత శిక్షణకు పదోతరగతి పాస్, ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన స్టూడెంట్స్ హాజరుకావచ్చన్నారు. 18 ఏళ్ల నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలం 35 రోజులు ఉంటుందని, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ట్యాలీ ప్లస్, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ కోర్సులపై ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు..హరిప్రసాద్, 9000487423 నెంబర్‌పై సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

గొడవలకు పాల్పడితే గ్రామ బహిష్కరణ



ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ పెద్దఓబన్న

సిద్ధవటం (ఒంటిమిట్ట) : గొడవలకు పాల్పడితే గ్రామ బహిష్కరణ చేస్తామని సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం గ్రామ ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్ పోల్ (ఎలక్షన్ తరువాత) జరుగు సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఎవరైనా సరే, ఎంతటి వారైనా సరే గొడవలకు దిగితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు రిజిస్టర్ చేసి వెంటనే రిమాండ్‌కు తరలించి జైలుకు పంపుతామన్నారు. అలాగే రౌడీ షీట్స్ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాల రాజకీయ పరంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరూ గలాటాలు, గొడవలు పెట్టుకోవద్దని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు



అమ్మవారికి 101 బిందెలతో అభిషేకం చేస్తున్న మహిళలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని కోనంపేట గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారికి శుక్రవారం నుంచి సోమవారం వరకు జ్యోతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటిరోజు అమ్మవారికి 108 బిందెలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి జ్యోతులు వెలిగించి పూజలు నిర్వహించారు. నేడు శనివారం పుష్పాండ మహర్షి పీఠాధిపతులు దివ్యానంద గిరి స్వాములచే జ్యోతిర్లింగ అలంకరణ చేశామన్నారు. అలాగే ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి పూజా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతోందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

